# సత్యవాక్కు

[redacted]

సంపుటి - 41 మే - 2020 సంచిక - 10

[redacted]

## క్రైస్తవ మాసపత్రిక

MAY - 2020

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

## టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

### సత్యవాణి

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త

బుధవారం సాయంత్రం : 6.30 గంటలకు రక్షణ

గురువారం మధ్యాహ్నం : 2.30 గంటలకు రక్షణ

ప్రతిరోజు ఉదయం : 7.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రతిరోజు మధ్యాహ్నం : 3.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రతి శనివారం ఉదయం : 6.30 ని॥లకు ఆరాధన

ప్రసంగీకులు : జాషువా గూటం

లిక్కీ గూటం

టోనీ గూటం

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


SATYA VANI

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 41 మే - 2020 సంచిక -10


## యేసు యేల మృతి బొందెను?

లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి బొందెను అని బైబిలు బోధించుచున్నది (1 కొరింథి 15:3). దేవునియొక్క నిత్య సంకల్పములో క్రీస్తు మృతి నొందుట ఒక అత్యవసర సంఘటనయై యున్నది. రక్షణ సంకల్పములో అది అతి ప్రధానమైనది. యేసుక్రీస్తు జగదుత్పత్తి మొదలుకొని వధింపబడి యున్న గొర్రెపిల్లయని ప్రకటన 13:8లో వ్రాయబడి యున్నది. ఆయన లోక పాపములను మోసికొనుపోవు గొర్రెపిల్లయని వర్ణించబడెను. పాప ప్రాయశ్చిత్తార్థ బలిగా ఆయన అర్పింపబడుటకు వచ్చెనని ఆయన ఎరిగినవాడై యుండెను. అందువలన దానిని గూర్చి ముందుగానే తన శిష్యులకు తెలియజేసెను (మత్తయి 16:21). క్రీస్తు యొక్క మరణము సువార్త వాస్తవములో మొదటిది. బాప్తిస్మము లోను, ప్రభురాత్రి భోజనములోను ఆయన మరణము యొక్క స్మృతి చిహ్నములున్నవి.

కల్వరి నుండి నేటి వరకు సిలువ యొక్క మర్మము, క్రీస్తు యొక్క ప్రాయశ్చిత్తార్థబలి, ఆయన పవిత్ర రక్త ప్రోక్షణ మొదలగునవన్నియు ఆయన శిష్యుల హృదయముల నావరించుకొని

యున్నవి. సిలువ పై యేసుక్రీస్తు యొక్క మరణము వలన అంటే దోషి కొరకు నిర్దోషి, పాపికొరకు పరిశుద్ధుడు చనిపోవుట వలన మనము పరలోక మందున్న తండ్రితో సహవాస మేర్ప రచుకొనే భాగ్యమేర్పడినది. యేసుక్రీస్తు మన మధ్యవర్తియు, ప్రధానయాజకుడునై యున్నారు. ఆయన ద్వారా మనము దేవుని కృపాసింహాసనము నొద్దకు చేరు చున్నాము (హెబ్రీ 4:14-16).

యేసు యేల మృతిబొందెను? అనే ప్రశ్నకు మనము సంపూర్తిగ జవాబీయలేము. అయినను ఆయన యేల మృతిబొందెనో సూక్ష్మముగా మనము లేఖనములలోని సత్యమును గ్రహించుకొనవచ్చును.

**యేసు మన ఆత్మల రాజుగా ఈ లోకమునకు వచ్చెను.** ఆయన సిలువ పై మృతినొందుట ద్వారా ఆ రాజరిక మును దృఢముగా నిరూపించెను. ధగధగ మెరయుచున్న రధముపై కూర్చొని గొప్ప సైన్య సమూహము ఆయనను వెంబడించుచు యుండగా జయంశూరునివలె ఆయన ఈ లోకమునకు రాలేదు. ఆయన యెరూషలేములో యుద్ధ చిహ్నమగ గుర్రముపై నెక్కి ప్రవేశించలేదు గాని ఆత్మీయ రాజుయొక్క చిహ్నమగు ఒక గాడిదపిల్ల నెక్కి ప్రవేశించెను. ఆయన ఒక రాజనీతి ధురంధురుని వలెగాని వేదాంతివలె గాని, లేక యోగివలె గాని ఈలోకములో ప్రవేశించలేదు. ఆయన ఒక సేవకుని వలె పరిచర్య చేయుటకే వచ్చెను గాని పరిచర్య చేయించు కొనుటకు రాలేదు.

ఆయన అధికారము ఆత్మీయ మైనది, శరీర సంబంధమైనది కాదు. ఆయన పరిపాలించేది మానవుల హృదయంము లనే గాని ఒక భూభాగాన్ని కాదు. చరిత్రయంతటి లోను యేసువంటి వాడు యెవడును లేడు; ఆయన రాజ్యములేని రాజు, సామ్రాజ్యము లేని చక్రాధిపతి, సైన్యములేని పాలకుడు, ఖడ్గములేని విజేయుడు. అందువలన ఆయన తన రాజ్యమును సిలువ మార్గము ద్వారా సంపాదించుట యెంత శ్రేష్ఠమో!

ఆయన గతయుగముల కార్య

క్రమమునంతటిని నెరవేర్చుటకు మరణించెను. పాత నిబంధనలోని గురుతులు, ప్రవచనములు, సారూప్య ములు మొదలగు వాటన్నిటి యొక్క బలిపీఠములు, పస్కాలు, అర్పణల కన్నిటికి ఆయన మరణము అంతిమ నెరవేర్పాయెను.

ఆయన రక్షకుడను సత్యమును స్థిరపరచుటకును, తన బోధయొక్క సత్యమును స్థిరపరచుటకును మరణిం చెను. యేసును సిలువ వేయుటకు పట్టుకొన్నవారు ఆయనను ప్రధాన యాజకుడైన కయప యొద్దకు తీసుకొని పోయిరి. ఆ ప్రధాన యాజకుడు ఆయనను చూచి నీవు దేవుని కుమారుడవైన క్రీస్తువైతే ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవుని తోడని నీకు ఆనబెట్టుచున్నాననెను. అందుకు యేసు–నీవన్నట్టే ఇది మొదలు కొని మనుష్య కుమారుడు సర్వ శక్తుని కుడిపార్శ్వమును కూర్చుండు టయు, ఆకాశ మేఘారూఢుడై వచ్చుటయు మీరు చూతురని చెప్పెను (మత్తయి 26:63, 64). ఆయనకు తీర్పు తీర్చుచు పిలాతు –నీవు రాజువా? అని ఆయనను అడుగగా యేసు–నీవన్నట్టు నేను రాజునే; సత్యమును గూర్చి సాక్ష్య మిచ్చుటకు నేను పుట్టితిని; ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని; సత్య సంబంధి యైన ప్రతివాడును నామాట వినున నెను (యోహాను 18: 37, 38). క్రీస్తు తన పవిత్ర రక్తమును సిలువపై చిందిం చుట ద్వారా ఈ లోక రక్షకుడని స్థిర పరచబడెను. తాను చేసిన బోధనంత టిని తన మరణ పునర్థుతా నము ద్వారా ఆయనే దేవుని కుమారుడని ప్రభావము తో నిరూపించ బడెను (రోమా 1:4).

మానవుని యెడల దేవునికున్న అమితమైన ప్రేమను నిరూపించుట కొరకు యేసు మృతిబొందెను. “దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకేగాని లోకమునకు తీర్పు

తీర్చుటకు దేవుడాయనను లోక ములోనికి పంపలేదు" (యోహాను 3: 16, 17). ఆయన మరణమే దేవుడు చేసిన గొప్ప త్యాగము. అందుకే యేసు ఇట్లు బోధించెను : "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము, మీరొకని నొకడు ప్రేమించవలె ననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటే ఎక్కువైన ప్రేమ గలవాడెవడునులేడు. నేను మీ కాజ్ఞాపించువాటిని చేసిన యెడల, మీరు నా స్నేహితులై యుందురు" (యోహాను 15:12,13).

**లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల కొరకు మృతిబొందెను.** పాప ప్రాయశ్చిత్తార్ధముగా ఆయన తన రక్తమును చిందించెను. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము. ఏలయనగా శత్రువులమై యుండగా ఆయన కుమారుని మరణము ద్వారా మనము దేవునితో సమాధానపరచబడిన యెడల సమాధానపరచబడినవారమై ఆయన జీవించుటచేత మరి నిశ్చయముగా రక్షింప బడుదుము'' (రోమా 5:8-10). యేసు తన శరీరమును పాపప్రాయశ్చిత్తార్ధ బలిగా యర్పించెను. "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు (లేక ప్రాయశ్చిత్తమై యున్నాడు); మన పాపములకు మాత్రమే కాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2). ఆయన తన ప్రాణమును బలవంతముగా కాక, యిష్టపూర్వకముగాను స్వేచ్ఛాపూర్వకముగాను మనందరి నిమిత్తము యిచ్చెను.

**క్రీస్తు జీవితమునకు కిరీటముగా యున్న ఆయన మరణము యొక్క అర్ధమేమిటి?** పాత యుగములలోను, వాటి బలిపీఠములు పస్కాలలో నీడ వలె కన్పడుట మాత్రమేగాక ప్రస్తుతము మానవులంనందరినీ తన యొద్దకు

ఆకర్షించుకొనుచున్న క్రీస్తు సిలువ యొక్క భావమేమిటి? మానవులకు మరణము తప్పించుకొనలేని భయముగా ఉన్నది. అయితే యేసుకు అది అట్లుకాదు. చనిపోవు నిమిత్తము ఆయన జన్మించెను; జీవించుటకూడా చనిపోవుటకే ఆయన జీవించెను. కల్వరి పై మానవుల పాపములకు ప్రాయశ్చిత్తము చేయుటలో తన ప్రాణము నిచ్చుటకై ఆయన ఈ లోకమునకు వచ్చెను.

యేసు యేల మృతిబొందెను? దీనికి జవాబు ఒకే ఒక్క మాటలో మనము చెప్పుకొన వచ్చును- సమాధానపరచు నిమిత్తము. దేవునికి మానవునికి మధ్య సమాధానము నెలకొల్పుటకు ఆయన వచ్చెను. మునుపు దూరస్థులై యున్న మనము ఇప్పుడు క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులమై యున్నాము (ఎఫెసీ 2:13). "కాగా ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను; ...అయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధాన పరచుకొని ఆ సమాధాన పరిచర్యను మాకు అనుగ్రహించెను... కావున మేము క్రీస్తుకు రాయబారులమై దేవునితో సమాధాన పడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలు కొనుచున్నాము. ఎందుకనగా మన మాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:17-20).

**యేసు ఒక హతసాక్షివలె గాక రక్షకునివలె మరణించెను.** ఆయన మన పాపముల నిమిత్తము మృతి బొందెను. పాపమే లేనియెడల మరణము అంటూ ఉండకపోవును, కల్వరి సిలువ, ముండ్ల కిరీటము ఉండకపోవును. అయితే పాపము ముల్లును విరుచుటకు యేసు ఈ లోకమునకు వచ్చెను. ఆయన మరణించి, సమాధి చేయబడి తిరిగి లేచెను. మానవులకు రక్షణను ఉచితముగా యిచ్చెను. ఆయనను నమ్మి బాప్తిస్మము పొందినవాడే రక్షించబడును. నమ్మ నొల్లనివానికి శిక్ష విధించబడును. నీవు యేసునందు విశ్వాసివా?

# మానవుడు దేవుని యొద్ద దొంగిలునా?

"మానవుడు దేవుని యొద్ద దొంగిలునా?"యని ఇశ్రాయేలీయులను మలాకీ ప్రశ్నించాడు (మలాకీ 3:8). వారు దేవుని యొద్ద దొంగిలుచున్నారని వారి మీద ఆక్షేపణ చేసాడు. వారు నిజంగా దేవుని యొద్ద దొంగిలుచున్నారని వారనుకోలేదు. నిజానికి ఆ తలంపే ఇశ్రాయేలీయులకు అభ్యంతరకరముగా యుండును. ఏలయనగా "దొంగిలవద్దు" అనేది పది యాజ్ఞలలో ఒకటి (నిర్గమ 20:15). అయినను ఇశ్రాయేలీయులు ఖచ్చితంగా అదేపని చేయుచున్నారని మలాకీ చెప్పాడు.

వారు దేవుని యొద్ద ఎట్లు దొంగిలించారు? వారు "పదియవ భాగమును, ప్రతిష్టార్పణములను ఇయ్యక దొంగిలిరి" యని మలాకీ ఆరోపణ చేసాడు (మలాకీ 3:8). దేవుడాజ్ఞాపించిన దశమ భాగమును వారు తీసికొనిరాలేదు. వారు అర్పించే అర్పణలలో గ్రుడ్డిదానిని, కుంటి దానిని, రోగముగల దానిని బలిగా అర్పించే వారు (మలాకీ 1:8). దేవునికి చెంద వలసిన వాటిని దేవునికి అర్పించి నప్పుడు వారు దేవుని యొద్ద దొంగిలించారు.

దురాశతో కూడిన వారి తత్వము నకు వేరుగా దేవుని యొక్క వాగ్దానము లను మలాకీ వారికి జ్ఞాపకము చేసాడు. వారు మొదట ఆయన కిచ్చిన యెడల పట్టజాలనంత విస్తారమైన దీవెనలు ఆయన వారిపై కుమ్మరించునని మలాకీ వారికి జ్ఞాపకము చేసాడు (మలాకీ 3:10-12).

"మానవుడు దేవుని యొద్ద దొంగిలునా?" అనే ప్రశ్నను మనము కూడా గమనించాలి. క్రైస్తవులు ధారాళముగా ఇయ్యకపోగా అపొస్తులులు గాని, యేసుక్రీస్తు గాని దశమ భాగము నర్పించుమని ఎక్కడా ఆజ్ఞాపించలేదు

గదా? యని ప్రశ్నిస్తారు. అది నిజమే. ఆయంశముపై వారు మౌనముగా యున్నందున మనము ఇచ్చుటను గూర్చి ఆజ్ఞాపించబడలేదని అర్థము కాదు. పరిశుద్ధాత్మప్రేరణతో అపో. పౌలు ఇట్లు చెప్పాడు : "నేను వచ్చి నప్పుడు చందాపోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింథీ 16:2).

మన ఆదాయమును గూర్చి క్రీస్తు ఎక్కువ ఉపదేశించారు. ధనము ను గూర్చి, ఆస్థినిగూర్చి మానవుని చింతన ఎరిగి మానవుడు సాతాను వలలో చిక్కుబడకుండునట్లు యేసు బోధించారు. యేసు చేసిన బోధలలో గృహనిర్వాహకత్వమును గూర్చి ఎక్కువ బోధించారు.

లూకా 21లో దేవాలయములో ధనవంతులు దేవునికి కానుకలిచ్చు వారిని ఆయన గమనించారు. అదే సమయంలో ఒక బీద విధవరాలు రెండు కాసులు అర్పించుట కూడా ఆయన చూసారు. యూదుల నాణెము లలో కాసు అతిస్వల్పమైనది. విస్తారము గా ఇచ్చిన ధనవంతులందరి కంటె ఈ బీదవిధవరాలు ఎక్కువ యిచ్చెను. వారందరు తమకు కలిగిన సమృద్ధిలో నుండి యిచ్చిరి గాని ఈమె తనకు కలిగినదంతయు యిచ్చెను (లూకా 21:1-4). ఆమె అంత ఎందుకు ఇచ్చుటకు ఇష్టపడినది? ఆ రెండు కాసులను ఆమె ప్రేమతో యిచ్చినది. ఆమె యిచ్చినది స్వల్పమే గాని ఆమె ప్రేమ మాత్రము గొప్పది.

క్రొత్త నిబంధనలో ధారాళముగా దేవునికిచ్చిన వారిలో ఆ బీద విధవరాలు ఒక్కతె మాత్రమే కాదు. 2 కొరింథిలో యెరూషలేములోయున్న క్రైస్తవులకు ధారాళముగా సహాయపడిన మాసి దోనియలోని క్రైస్తవులను పౌలు అభినందించాడు. ఈ మాసిదోనియ క్రైస్తవులు నిరుపేదలు, బాధలలోయున్న వారు (2 కొరింథీ 8:2). ఈ మాటలను బట్టి వారు బహుగా నిరుపేదలై

యుండిరని గ్రహించుకోగలము. అయినను అంత దీనస్థితిలోయున్నను, నిరుపేదలైనను వారు బీదలైన యూదులకు సహాయపడుటకు ధారాళముగా యిచ్చిరి. వారు చాలా యిచ్చారని పౌలుకూడా తలంచాడు. వారంతధారాళముగా ఎందుకు యిచ్చారు? వారు దేవుని చాల ప్రేమించారు గనుక యిచ్చారు. వారు మొదట తమ్మును తాము దేవుని కర్పించు కొన్నారు (2 కొరింధీ 8:5).

మనమెందుకు ఇస్తాము? గొప్ప కార్యములను సాధించుట కొరకు కాదు. నిజానికి మనలో ఏ ఒక్కరు గొప్ప కార్యములు చేయలేము గనుక సాధారణంగా ఇయ్యము.

- మనము దేవుని మహిమ కొరకు, ఘనత కొరకు యిస్తాము.

- మనం దేవుని ప్రేమించు చున్నాము గనుక యిస్తాము. మరియు ఇచ్చుట ద్వారా మన ప్రేమను వెల్లడి పరుస్తాము. మనము స్వల్పముగానే యిస్తే దేవుని యెడల మనకున్న ప్రేమ కూడ స్వల్పమే. మన యెడల దేవుని ప్రేమ మనము ఊహించలేనంత గొప్పది. గనుక అమితముగా మనలను ప్రేమించు ఆయన సన్నిధిలో మనం కొంచెమే యిచ్చి ఎట్లు నిలబడగలము?

- మనం ఎంత ఇయ్యాలి? యూదులు దశమ భాగము నియ్యాలని ఆజ్ఞాపింపబడిరి. కాని అది ఆరంభము మాత్రమే.

- అంతేకాకుండా వారనేక స్వేచ్ఛార్పణలు, బలులు వగయిరా అర్పించేవారు.

క్రైస్తవులలో అనేకులు మేము బీదవారమనుకొంటారు అని సామాన్య పదము మాత్రమే. దేవుడు మనలను దీవించుకొలది మనము ఆయనకు ఇయ్యాలి. ఆ బీదవిధవరాలు ఆ రెండు కాసులు ఇచ్చిన తరువాత ఆమె యొద్ద మిగిలినది యేమీలేదు. మాసిదోనియ క్రైస్తవులు బహు నిరుపేదలైనను విస్తారముగా యిచ్చిరి. దాతృత్వము కలిగి యుండవలసిన విషయములో మేము బీదవారమనే సాకును ఎన్నడు

చెప్పకూడదు. దేవుడు మన హృదయాన్ని పరీక్షించి తీర్పు తీరుస్తారు గాని దాని విస్తీర్ణమును బట్టి కాదు.

మనలను మనము దేవునికి సమర్పించుకోవాలి. మనము ఇయ్య గలిగినదంతా ఇయ్యాలి. మనం మొదట ఆయన కిచ్చిన యెడల మనలనాశీర్వదింతునని దేవుడు వాగ్ధానం చేసారు. "ఇయ్యుడి అప్పుడు మీకియ్యబడును. అణచి కుదిలించి దిగజారునట్లు నిండు కొలతలను మనుష్యులు మీ ఒడిలో కొలుతురు. మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువ బడును" (లూకా 6:36).

యిది సంపదను గూర్చిన వాగ్దానము కాదు, గాని మనకేది అవుసరమోదానిని ఆయన మన కనుగ్రహించుననే నిర్ధారణయే.

మనుష్యుడు దేవుని యొద్ద దొంగిలునా? యిది తీవ్రమైన ప్రశ్నయే. అది మలాకీ కాలములో ఎంత యదార్థమో నేటి మన కాలములో కూడ అంతే యదార్థము. నేను దేవుని యొద్ద దొంగిలుచున్నానని క్రైస్తవుడెవరు ఆలోచించుకొనడు, గాని ఆయన ఉద్దేశించిన రీతిగా ఇచ్చుటలో మనం వెనుకబడిన యెడల,మనం నిజంగా అదే చేయువారమగుదుము.

- జెర్రీబేట్స్

మీరు సత్యవాక్కు సాలు చందాకట్టారా? లేని యెడల ఇప్పుడే రూ.**50/-**లు ఎమ్.ఓ. చేసి మీ సభ్యత్వమును కొనసాగించు కొనండి.

సత్యవాణి

7-9-35, సాంబమూర్తి వీధి, కాకినాడ - **533 004.**

# తల్లిదండ్రులను గౌరవించుట

మోషే ద్వారా దేవుడిచ్చిన పది యాజ్ఞలలో 5వ ఆజ్ఞ ఇట్లు చెప్పు చున్నది : "నీ దేవుడైన యెహోవా నీ కనుగ్రహించు దేశములో నీవు దీర్ఘా యుష్మంతుడగునట్లు నీ తల్లిని తండ్రిని సన్మానించుము" (నిర్గమ 20:12). పాత నిబంధన కాలంలో తల్లిదండ్రు లను సన్మానించాలని మోషే ద్వారా దేవుడెట్లు ఆజ్ఞాపించారో అట్లే కొత్త నిబంధనలో పౌలు ఇట్టు చెప్పాడు. "పిల్లలారా ప్రభువు నందు మీ తల్లి దండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తల్లిని తండ్రిని సన్మానింపుము; అప్పుడే నీవు భూమి మీద దీర్ఘాయుష్మండవ గుదువు, ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది.

మొండివాడై తిరుగుబాటు చేయు కుమారునికి మరణ శిక్షను విధించాలని దేవుడు ఆజ్ఞాపించారు (ద్వితీయ 21:18-21). ఈయాజ్ఞను క్రీస్తు కూడ ఎత్తి చూపారు : " తల్లి దండ్రులను ఘనపరచుమనియు, తండ్రినైనను తల్లినైనను దూషించు వాడు తప్పక మరణము పొంద వలెననియు దేవుడు ఆజ్ఞాపించెనని" ఆయన చెప్పారు (మత్తయి 15:4). "నిన్ను కనిన నీ తండ్రి ఉపదేశము అంగీకరించుము, నీ తల్లి ముదిమి యందు ఆమెను నిర్లక్ష్యము చేయకుము" అని సొలొమోను చెప్పాడు (సామె 23:22).

తలిదండ్రులను గౌరవించి, ప్రేమించి, సన్మానించే బాధ్యతను దేవుడు ప్రతి మనుష్యునికి అప్పగించారు. అయితే యేసు కాలము నాటి శాస్త్రులు, పరిసయ్యులు ఈ యాజ్ఞను పాడుచేసే మార్గము నెంచు కున్నారు. వారిని గద్దించుచు యేసు ఇట్లు చెప్పారు : "మీరైతే ఒకడు తన తండ్రినైనను, తల్లినైనను చూచి నీ వలన నా కేది ప్రయోజనమో అది దేవార్పితమని చెప్పిన యెడలన అతడు తన తండ్రినైనను, తల్లినైనను ఘన

పరచనక్కరలేదని చెప్పుచున్నారు. మీరు మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్ధకము చేయుచున్నారు" (మత్తయి 15 : 5-6).

వృద్ధాప్యములో యున్న తలిదండ్రులకు సహాయము చేయుట మాని, దానిని వారు దేవునికర్పించేసారని చెప్పేవారు. "అయినను ఒకడు తన తల్లినైనను, తండ్రినైనను చూచి నా వలన నీకు ప్రయోజనమగునది ఏదో అది కొర్బాను, అనగా దేవార్పితమని చెప్పిన యెడల, తన తండ్రికైనను, తల్లికైనను వానిని ఏమియు చేయనియ్యక, మీరు నియమించిన మీ పారంపర్యాచారము వలన దేవుని వాక్యమును నిరర్ధకము చేయుదురు" (మార్కు 7:11,12). కొర్బాను అనగా సాధారణముగా ఒట్టుపెట్టుకొని ప్రత్యేకముగా ఉంచబడినది. అది దేవుని సేవ కొరకై ప్రత్యేకింపబడినది గనుక దానిని ఇంకెవరికీ వినియోగింప వీలుపడదు, వారి పారంపర్యాచారములు ఇవ్విధముగా తమ స్వార్ధము నిమిత్తము ఒక మార్గము నెంచుకొన్నాయి. "మీరు మీ పారంపర్యాచారము వలన దేవుని వాక్యమును నిరర్ధకము చేయుచున్నారని" యేసు చెప్పెను (మత్తయి 15:6).

నేటి సంగతి ఎట్లున్నది? మున్నెన్నడు లేని విధంగా తలిదండ్రులు ఎక్కువ అగౌరవపరచబడుచున్నారు. అయినను పాత నిబంధన కాలములో అది ఎంత పాపమో నేడును అది అంతే పాపము. చిన్న పిల్లల హింసను గూర్చి తరుచు మనము వినుచుయుంటాము. అది ఘోరం, గాని తలిదండ్రుల హింసను గూర్చి మనం ఎక్కువ వినము. మన సంభాషణలలోను, ఆదరణలోను తలిదండ్రులను గాయపరచగలము. అధికారమును గౌరవించి, దానిని మన బిడ్డలకు నేర్పించాలి.

- చార్ల్స్ బిక

# ఆరాధన అనగాయేమి?

క్రైస్తవులు చేయు ప్రాముఖ్య విధులలో ఆరాధన ఒకటియై యున్నది. అధునిక ఆరాధనలో మానవులు దేవుని వాక్యాధారము లేని అనేక సంగతులు కల్పించారు. అందువలన మాటచేత గాని క్రియచేత గాని మీరేమి చేసినను ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు సమస్తమును ఆయన పేరిట చేయుడి" యని అపో.పౌలు చెప్పాడు (కొలస్స 3:17). యేసు పేరట ఏదైనా చేయడం అంటే ఆయన అధికారము చొప్పున చేయుట. బైబిలు ఆధారము లేని ఆరాధన వ్యర్థము అనగా నిష్ ప్రయోజనము (మత్తయి 15:9). గనుక బైబిలు సంబంధమైన ఆరాధనలో యేమేమి వున్నదో తెలిసికొని మనము చేయు ఆరాధన దేవునికి అంగీకార యోగ్యముగా యుండునట్లు చూచుకొన వలెను.

ఆరాధన అనగాయేమి?

క్రొత్త నిబంధనలో వాడబడిన ఆరాధన అను పదమునకు వంగి నమస్కరించుట సాగిలపడుట లేక అమితమైన భక్తి గౌరవములను చూపుట యని అర్ధము. అది భక్తిని, గౌరవమును విధేయుతను చూపుట. యోహాను 4:23,24 ఆరాధనను గూర్చి ఇట్లు చెప్పుచున్నది. "యదార్ధముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చేయున్నది తన్ను ఆరాధించు వారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు; దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింప వలెను". యదార్ధముగా ఆరాధించు వారిని గూర్చి యేసు చెప్పినందున యధార్ధముగా ఆరాధింపని వారుందురని మనకు గ్రాహ్యమగుచున్నది.

మనము తండ్రియైన దేవుని ఆరాధించాలి. యిది ప్రేమను సన్నిహితత్వాన్ని సూచించుచున్నది (ఎఫెసీ 1:3; లూకా 11:2-4). అయినను దేవుని

యెడల మనకుండవలసిన భక్తి భావములు సంభ్రమాశ్చర్యములు కొనసాగుచు యుండాలి. ఆయన యెడల ఇట్టి భావములకు ఆయన అర్హుడు. ఆరాధన ఆత్మతోను సత్యముతోను యుండాలి. ఆత్మతో కూడిన ఆరాధన హృదయపూర్వకముగా నిష్కపటముగా యుండును మరియు దేవుడు తన వాక్యములో చెప్పిన రీతిగా చేయుట సత్యారాధనయై యుండును. "నీ వాక్యమే సత్యము" అని యేసు చెప్పారు (యెహాను 17:17). గనుక సత్యముతో ఆరాధించుట యనగా ఆయన చెప్పినట్లు చేయుటయే.

దేవుని ఘనపరచు క్రియ ఆరాధనయై యున్నది. ఆరాధింపబడవలసిన వాడు దేవుడే గాని మానవుడు కాదని మనం గ్రహించుకోవాలి. దేవుడెవరోయని తెలుసుకొని ఆయనను గుర్తించుట నీవెవరవోయని గుర్తించుట; తదనుగుణంగా స్పదించుటయే ఆరాధనయని ఒకాయన అన్నారు. యిది ఒక సూక్ష్మ నిర్వచనం. ఈ పాఠంలో దానిని మూలముగా వినియోగించుటకు ప్రయత్నించుదాం.

ఆరాధనలో దేవుడెవరో తెలుసుకొని గుర్తించుట ముఖ్యము. దేవుడు సృష్టికర్త. ఆయన భూమ్యాకాశములను అందలి సమస్తమును సృజించినవాడు (ఆది.కా. 1:1; కొలస్స1:16). ఆయన ఒక్కడే నిజమైన దేవుడు (నిర్గమ 20:2,3). ఆయన సంపూర్తిగా యదార్థవంతుడు, నీతిమంతుడు, న్యాయవంతుడు (మార్కు 10:18). ఆయన ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు అని యెషయా చెప్పినప్పుడు ఈ సత్యాన్ని వక్కాణించుచున్నాడు (యెషయా 1:4; 43:15). ఇదొక విపరీత విరుద్ధము. పరిశుద్ధుడు మన మధ్యన యున్నాడు. "సీయోను నివాసీ ఉత్సాహధ్వని బిగ్గరగా చేయుము. నీ మధ్యనున్న ఇశ్రాయేలు యొక్క పరిశుద్ధ దేవుడు ఘనుడై యున్నాడు" (యెషయా 12:6).

రెండవదిగా మనమెవరమో గుర్తించాలి : మానవుని యొక్క

జీవితాన్ని సంక్షిప్తముగా చెప్పుటకు పౌలు కీర్తన 14:1–3; 53:1–3లను రోమా 3:10–12లో ఎత్తిచూపించాడు. "నీతిమంతుడు లేడు ఒక్కడును లేడు. గ్రహించువాడెవడును లేడు, దేవుని వెదకు వాడెవడును లేడు. అందరును త్రోవతప్పి యేకముగా పనికిమాలిన వారైరి. యోబు పరీక్షను ఎదుర్కొని నిలిచి వాడైనను, "నన్ను నేను అసహ్యించుకొని ధూళిలోను బూడిదలోను పడి పశ్చాత్తాప పడుచున్నాను" అని పలి కాడు (యోబు 42:6).

ప్రవక్తయైన యెషయా దైవ దర్శనమును పొందిన తరువాత "అయ్యో అపవిత్రమైన పెదవులు గలవాడను" అని అరిచాడు (యెషయా 6:5). మనము నీతిమంతులు గా సద్వర్తనులుగా తరుచు ఎంచుకొను చున్నను దేవునితో పోల్చినప్పుడు మనం పాపాత్ములము. దేవుని పరిపూర్ణ స్థాయి అది. మానవుని మంచితనము కంటే ఎంతో ఉన్నతమైనది గనుక ఆరాధనలో ఒకడు తన పాపపు తత్వాన్ని అనర్హతను గుర్తిస్తాడు. దేవుని సమీపించుటకు అతని అయోగ్యతను గుర్తిస్తాడు (లూకా 5:8; యెషయా 6:5). యిది ఆరాధించు వాని హృదయంలో కృతజ్ఞతను వినయము ప్రోత్సహిస్తాది.

మూడవదిగా మనము సరియైన విధముగా స్పందించాలి. సరియైన స్పందన అనగా యేమిటి? ఇందులో అనేక సంగతులు ఇమిడి యున్నాయి.

1. మనము విన విధేయతలు కలిగి దేవుని పై ఆధారపడాలి.

2. కృతజ్ఞత భావము కలిగి యుండాలి. మానవుడు కృతజ్ఞత కలిగి యుండాలని బైబిలు ప్రోత్సహించు చున్నది. మన ప్రభువైన యేసు ద్వారా తండ్రియైన దేవునికి ఎల్లప్పుడు కృతజ్ఞత చెల్లించుచు యుండాలి (ఎఫెసీ 5: 20).

3. అట్లే మనము సంతోషముతో నిండియుండాలి. "ప్రభువునందు ఎల్లప్పుడు ఆనందించుడి మరల చెప్పుదును ఆనందించుడి" (ఫిలిప్పీ 4 :4). "కాగా మీరు పరిశుద్ధాత్మ శక్తి పొంది, విస్తారముగా నిరీక్షణ గలవార

గుటకు దేవుడు విశ్వాసము ద్వారా సమస్తానందముతోను సహనముతోను మిమ్మును నింపునుగాక" (రోమా 15:13).

4. ఆయన చిత్తముకు మనము సంపూర్తిగా సమర్పించుకొనవలెను. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను. ఇట్టిసేవ మీకు యుక్తమైనది".

అన్నీ కరెక్టుగా ఆరాధించితే సరిపోదు. అది పవిత్ర జీవితమునకు నడిపించాలి. మన జీవిత విధానము నుండి మన ఆరాధనను వేరుచేయ లేము. పరిశుద్ధ జీవితం మన ఆరాధన యనంతరం కనబడని యెడల దేవుడు మన ఆరాధనను ద్వేషిస్తారు. "మీ పండుగ దినములను నేను అసహ్యించు కొనుచున్నాను, వాటిని నీచముగా ఎంచుచున్నాను. మీ వ్రతదినములలో కలుగు వాసనను నేను అఘ్రాణించ నొల్లను. నాకు దహనబలులను; సమాధాన బలులుగా మీరర్పించు క్రొవ్విన పశువులను నేను చూడను" (ఆమోసు 5:21,22). ఆమోసు కాలములోని ఇశ్రాయేలీయులు దేవుని సరిగనే ఆరాధించు చున్నారు. గాని వారి జీవితములలో పరిశుద్ధత లేదు. గనుక దేవుడు వారి ఆరాధనను తిరస్కరించారు.

## ఆరాధన యొక్క ప్రయోజనములు

ఆరాధన యొక్క రెండవ ఉద్దేశ్యము సహోదరులను హెచ్చరించుటయే. "కొందరు మానుకొను చున్నట్టుగా సమాజముగా కూడుట మానక ఒకని నొకడు హెచ్చరించుచు ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరియెక్కువగా ఆలాగు చేయుచు ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పరికొల్ప వలెను" (హెబ్రీ 10:25). సమాజముగా (సంఘముగా) కూడుకొనుటను యిది వక్కాణించుచున్నది. సంఘముగా కూడుకొనకుండా ఒకరి నొకరు హెచ్చరించలేము.

"సమస్తమును క్షేమాభివృద్ధి కలుగుటకై జరుగనియ్యుడి" యని కొరింధులోని సంఘమునకు అపొ. పౌలు సలహాయిచ్చాడు (1 కొరింధీ 14:26). క్షేమాభివృద్ధి పెరుగుదలను సూచించుపదము 1 కొరింధీ 14లో 7 సార్లు వినియోగింపబడెను. ఆరాధనలో యున్న లోపములను ఆత్మీయ వరములను గూర్చిన లోపము లను సరిదిద్దుటకు పౌలు కొరింధీయు లకు పత్రికలు వ్రాశాడు. అయినను సంఘము యొక్కయు క్రైస్తవుల యొక్క యు క్షేమాభివృద్ధియే ముఖ్య ఉద్దేశ్యము.

ఆరాధన యొక్క మరియొక ఉద్దేశ్యము మన రక్షణను ప్రకటించుట కును క్రీస్తులో మన ఐక్యతను చాటుట కును అయియున్నది. "మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చు కొనుటయే గదా. మనము విరుచు రొట్టె తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయే గదా. మనమంద రము ఆ ఒక్కటే రొట్టెలో పాలుపుచ్చు కొను చున్నాము. రొట్టె ఒక్కటే గనుక అనేకులైన మనము ఒక్కటే శరీరమై యున్నాము" (1 కొరింధీ 10:16,17). దాని తదుపరి అధ్యాయములో "మీరు ఈ రొట్టెను తిని, ఈ పాత్రలోనిది త్రాగునప్పుడెల్లా ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురించుదురు" అని చెప్పాడు (1 కొరింధీ 11:26). గనుక మనము ప్రభురాత్రి భోజనము లో పాలుపొందునప్పుడెల్ల క్రైస్తవేతరు లకు క్రైస్తవులకు కూడ క్రీస్తు యొక్క గొప్ప తనమును గూర్చి బలియాగ మును గూర్చి ప్రకటించుదుము. తోటి క్రైస్తవులకు మన రక్షణ గూర్చి క్రీస్తు శరీరములో యున్న గొప్ప సహవాస మును గూర్చి ప్రచురించుదుము.

## ముగింపు

ఆరాధన అనగా యేమిటో దాని ప్రయోజనము లేమిటో ఈ పాఠములో గమనించాము. ఆధునిక ఆరాధనలలో అనేక అపశృతులు ప్రవే శించాయి. ఆరాధన యొక్క ఉద్దేశ్య మును మరచి దానిని మన వినోద కార్య క్రమముగా ఎంచుటవలన అట్లు జరిగి నది. రాబోవు సంచికలో ఆరాధన లోని ప్రతి క్రియను విశ్లేషించుదము.

# ధర్మశాస్త్రము నొద్దకు మరలితే కలిగితే

పాతనిబంధన దైవికమైన చట్టము. అది మోషే ద్వారా దేవునిచే ఇయ్యబడెను. అయినను వారొక క్రొత్త నిబంధన కొరకు ఎదురు చూడవలెనని ఆ రోజుల్లోనే వారికి చెప్పబడెను : "ఇదిగో నేను ఇశ్రాయేలువారితోను, యూదావారితోను క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; ఇదే యెహోవా వాక్కు" అని ఆయన తెలియ జేసెను (యిర్మీయా 31:31). గనుక మొదటి నిబంధన నిరంతరము వుండు టకు ఉద్దేశించబడినది కాదు.

"మనము విశ్వాసము ద్వారా నీతిమంతులముగా తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు" ధర్మశాస్త్రము ఇయ్యబడెను (గలతీ 3: 24,25). ధర్మశాస్త్రము యూదులను అన్యజనులను వేరుచేసెను. వారి మధ్యనున్న గోడను యేసు పడగొట్టి అందరు క్రీస్తులో ఏకమై యుండునట్లు చేసెను (ఎఫెసీ 2:14).

ప్రజలు ధర్మశాస్త్రము నొద్దకు మరలిపోయే ప్రమాదము ఎల్లవేళలా యున్నది, గాని అట్లు మరలిన వారికి కలుగు పర్యవసానములు తీవ్రమైనవి. పౌలు సున్నతిని గూర్చి చర్చించాడు; ఏలయనగా "కొందరు యూదయ నుండి వచ్చి - మీరు మోషే నియమించిన ఆచారము చొప్పున సున్నతి పొందితేనే గాని రక్షణ పొంద లేరని" బోధించు చుండిరి (అపొ.కా. 15:1). పౌలు ఇట్లు చెప్పాడు: "చూడుడి మీరు సున్నతి పొందిన యెడల క్రీస్తు వలన మీకు ప్రయోజన మేమియు కలుగదని పౌలను నేను మీతో చెప్పుచున్నాను. మీలో ధర్మ శాస్త్రము వలన నీతిమంతులని తీర్చ బడువారెవరో వారు క్రీస్తులో నుండి బొత్తిగా వేరు చేయబడియున్నారు, కృపలోనుండి తొలగిపోయి యున్నారు" (గలతీ 5:3,4).

నేడు మనము పాతనిబంధనను పాటించాలని చెప్పేవారికి కలుగు మూడు పర్యవసానములున్నాయి.

**మొదటిగా మనం ధర్మశాస్త్ర మంతటికీ బద్ధులమై యున్నాము :**

మనము ధర్మశాస్త్రము నాచరింప మెదలిడితే దాని నంతటినీ ఆచరిపం బద్ధులమై యుందుము (గలతీ 5:3). అనగా జంతుబలులనర్పించాలి, ప్రతి ముఖ్యమైన యూదుల పండుగకు యెరూషలేము వెళ్లాలి మరియు ధర్మ శాస్త్రమునతిక్రమించుట వలన కలుగు శిక్షలకు బద్ధులమై యుండాలి. ధర్మ శాస్త్రమంతయు కేవలము పది యాజ్ఞలే కాదు. పాతనిబంధనలో మనకిష్టమైన వాటిని ఎంచుకొని మిగతావాటిని విసర్జించలేము. ఆచరిస్తే దాని నంతటినీ ఆచరించాలి.

**రెండవదిగా క్రీస్తు మనకు నిష్ప్రయోజనమగును :**

ధర్మశాస్త్రము సిలువ యొద్ద ఎత్తి వేయబడెను గనుక ఇక మీదట అది ఎవరి మీద అధికారము కలిగినది కాదు, ఒకడు ధర్మశాస్త్రము వలన నీతిమంతుడుగా తీర్చబడితే, యేసు యొక్క సిలువ ప్రయోజనమేమి? కొట్టివేయబడిన ధర్మశాస్త్రము వలన మనము రక్షింప బడ గలిగితే క్రీస్తు చనిపోయినది వ్యర్థమే.

**మూడవదిగా మనము కృపలో నుండి తొలగిపోవుదుము :**

ధర్మశాస్త్రము వలన ఎవడును నీతిమంతుడుగా తీర్చబడలేడు. దానిని తొలగించుట ద్వారా సువార్త ద్వారా రక్షింపబడే మార్గము తెరువబడెను. మనము దేవుని దయగలిగి ఆయన కృప ద్వారా రక్షింపబడగలము.

ఒకడు ధర్మశాస్త్రము వైపు తిరిగి వెళ్లాలని ప్రయత్నించిన యెడల అతడు కృపలో నుండి తొలగిపోయినవాడు, సువార్తకు లోబడు ద్వారా మనకు రక్షణ కలుగును. ఇంకొక మాటలో మనము కృపద్వారా రక్షింపబడుదుము.

మొట్ట మొదటిగా సువార్త ప్రకటింపబడినప్పుడు లోబడిన వారు ధర్మశాస్త్రము వలన గాక కృపవలననే రక్షింపబడిరి. వారు దేవుని దయ కలిగి యుండిరి. గాని ధర్మశాస్త్రము నొద్దకు మరలిపోయిన యెడల ఆయన దయను కోల్పోవుదురు.

**- ఆల్బర్ట్ గార్డ్నర్**

# రాజ్యము రాబోవుచున్నదా?

క్రీస్తు భూమి మీదకి వచ్చి తన రాజ్యమును స్థాపించి ఏలునని కొందరు చెబుతుయుంటారు. గాని వారొక ప్రాముఖ్య సంగతిని గమనించరు. ఆయన తన రాజ్యమును ఎప్పుడో స్థాపించేసారు. ఆయన రెండు వేల సంవత్సరముల పైగా నుండి పరిపాలించు చున్నారు.

మార్కు 9:1లో యేసు తన శిష్యులతో "ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను". ఆయన రాజ్యము త్వరలో వచ్చుచున్నదని, అది వచ్చేసరికి వారిలో కొందరు ఇంకా బ్రదికే యుంటారని యేసువారికి విశదీకరించారు. తదుపరి వారందరు చనిపోయారు. వారు చనిపోయి కొన్ని శతాబ్దాలు గడిచిపోయాయి, గనుక వారి జీవిత కాలములోనే రాజ్యము వచ్చేసియుండాలి. అది భవిష్యత్తులో జరిగే సంఘటన కాదు.

కొలస్స 1:13లో అపో.పౌలు దేవుని గూర్చి చెబుతు, "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులునుగా చేసెను" అని చెప్పెను. దీనిని బట్టి పౌలు కొలస్సయులకు వ్రాయుసరికి రాజ్యము స్థాపించబడి యున్నట్లు విపులీకరించ బడినది. మొదటి శతాబ్దములోనే, పౌలును, ఇతరులును అప్పటికే దేవుని రాజ్యనివాసులై యుండిరి. గనుక మార్కు 9:1లో యేసు చెప్పిన మాటల తదనంతరము వెంటనే రాజ్యము స్థాపించబడెను. అది పౌలు కొలస్స 1:13 వ్రాయకముందే స్థాపించబడి యుండెను. సువార్తకులోబడు ప్రతి వ్యక్తి దేవుని రాజ్య పౌరుడగును (ఫిలిప్పీ 3:20). మరియు ఆయన శరీరములో అనగా ఆయన సంఘములో సభ్యుడగును (కొలస్స1:18; గలతీ 3:26,27).

క్రీస్తు యొక్క రాజ్యము ఎప్పుడు ఆవిష్కరింపబడెనో మనము ఊహించ నవుసరములేదు. అపో.కా. రెండవ అధ్యాయములో ఆరాజ్యము బలముతో

(శక్తి), పెంతెకొస్తుఅను యూదుల పండుగ దినమున యెరూషలేములో అది స్థాపించబడినదని ధృవీకరించ బడినది. మూడు వేలమంది ఆరోజు సువార్తకు విధేయులయ్యిరి! అది సంఘము యొక్క ఆరంభము, అదే క్రీస్తు రాజ్యము.

క్రీస్తు మరల వచ్చునా? అవును! ఆయన మరల వచ్చునని అపొ.కా. 1:1లో ప్రకటించుచున్నది. గాని ఆయన భూమి మీదనివసించి ఒక ముఖ్యపట్టణము నుండి పాలించునని బైబిలు చెప్పుటలేదు. ఆయన మరల వచ్చినప్పుడు రాజ్యమును స్థాపించి పాలించునని కొందరు బోధిస్తారు. దానికి ప్రకటన 20 అధ్యాయమును వారు వినియోగిస్తారు. అయినను ప్రకటన 20వ అధ్యాయమును మనము జాగ్రత్తగా పరిశీలిస్తే క్రీస్తు భూమి మీదకు వచ్చుటను గూర్చి అది యేమీ బోధించుట లేదు.

క్రీస్తు రాజ్యము ఇప్పటికే స్థాపించబడియున్నది. క్రీస్తు ఇప్పుడు రాజుగా పాలించుచున్నారు. ఆయన మరల వచ్చినప్పుడు క్రైస్తవులందరు బ్రదికి యున్నవారు గాని, మృతిజెందిన వారుగాని అందరు ఆకాశమేఘముల గుండా ప్రభువును ఎదుర్కొనుటకు కొని పోబడుదురు. “కాగా మనము సదా కాలము ప్రభువుతో కూడ ఉందుము” (1 థెస్స 4:17). క్రీస్తు రెండవసారి వచ్చినప్పుడు రాజ్యమును స్థాపించు టకు కాదు గాని ఆ రాజ్యమును భూలోకము నుండి తీసికొని తండ్రికి అప్పగించుటకు వచ్చును.” అటు తరువాత ఆయన సమస్తమైన ఆధిపత్యము, సమస్తమైన అధికారము ను, బలమును కొట్టివేసి తన తండ్రి యైన దేవునికి రాజ్యము అప్పగించును, అప్పుడు అంతము వచ్చును (1 కొరింథీ 15:24).

మనము దేవుని రాజ్యమును వెదకాలి. అది ఇక్కడే, ఇప్పుడే స్థాపిం చబడియున్నది. అది భవిష్యత్తులో వచ్చేదికాదు. క్రీస్తు రాజ్యమే క్రీస్తు సంఘము. మనము ఆయన సంఘము ను కనుగొనిన యెడల ఆయన రాజ్యమును కనుగొన్నాము!

- రోయస్ ఫ్రెడరిక

# సంక్షిప్త వార్తలు

2020 మార్చి నెల ఆఖరి వారము నుండి భారతదేశమంతా లాక్‌డౌన్ ప్రకటించబడింది. కరోనా కోవిడ్-19 వైరస్‌ను అరికట్టుటకు గాను ప్రపంచ మందలి అనేక దేశములు ఈ చర్యను చేపట్టినవి. అన్ని ప్రయాణ రవాణా సౌకర్యములు ఎక్కడివి అక్కడే నిలుపవేయబడినవి. జనులు తమ ఇండ్లలో నుండి వచ్చి బయట సంచరించుట నిషేధించబడినది. అన్ని వ్యాపారసంస్థలు, దుకాణములు మూసివేయబడినవి. మెడికల్ స్టోర్స్‌ను, ప్రభుత్వాసుపత్రులును తప్ప మిగతావన్నీ నిరవధికముగా మూసివేయబడినవి. దీని ఫలితముగా క్రైస్తవులు సంఘముగా కూడి తమ చర్చిబిల్డింగ్‌లలో ఆరాధనచేయడం సాధ్యముకాలేదు. గనుక క్రీస్తు సంఘస్థులు తమ తమ కుటుంబ ములలోనే ప్రతి ఆదివారము రొట్టె విరుచుటకు కూడుకొని మొదటి శతాబ్దములో వలే ఆరాధన చేయుచుండిరి. కాకినాడ సత్యవాణి బిల్డింగ్‌లో అయితే ప్రతి ఆదివారము హాజరుకాగలిగిన కొద్దిమందితోనే ఆరాధన జరుగుచుండెడిది. ప్రతి గృహములో ఆరాధన జరిగేది.

2020 మార్చి 25వ తేదీన రాబిన్ గూటం రేచెల్ దంపతులకు రెండవ కుమారుడు జన్మించాడు. ఆయన జాషువా గూటం గారికి మూడువ మనవడు. ఇద్దరు మనుమరాండ్రును కూడ దేవుడనుగ్రహించి ఆయనను దీవించారు.

కరోనా విపత్తువలన లాక్‌డౌన్‌లో అనేకమంది పేదలు ఆహారము కొరకు ఇబ్బంది పడుచుండగా రిక్కీగూటం గారు 200 మందికి ప్రతిరోజు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తు స్వయాన ఆయనే వారికి వడ్డించేవారు. మరియు కాకినాడ పట్టణ పోలీసులకు, మున్సిపల్ ఉద్యోగులకు, పారిశుధ్య కార్మికులకు ముఖములకు మాస్కులు, శానిటైజర్స్ మరియు మంచినీటి బాటిల్స్‌ను పంచే వారు. ఆయన చేతులుమీదుగా కొన్నివేల మందికి ఈ సౌకర్యము లభించినది. కాకినాడ గవర్నమెంటు ఆసుపత్రి డాక్టర్లకు అత్యవసరమైన PPE లను (వ్యక్తి గత రక్షణ కవచములను) ఉచితముగా అంజేసిరి.

కరోనా వలన వందలాది ప్రజలు భారతదేశంలో మృతిజెందారు. అమెరికాలో 20 లక్షలకు పైగా ఈ వ్యాధిసోకింది. ఈ వార్త వ్రాయుసరికి 50 వేలక్షు పైగా అక్కడ మరణించారు. త్వరలో ఈ విపత్తును తొలగించాలని మనందర్యం ప్రార్థన చేద్దాం.

కరోనా భయకంపిత వాతావరణాన్ని సృష్టించినా దానిలో కూడ కొంత మేలును మనం చూడగలం. ఇప్పటి వరకు యంత్రముల వలె తయారైన మనుష్యులను మామూలు మనుష్యులుగా తయారు చేసినది. కుటుంబసభ్యుల నందరినీ ఒక్కచోట చేర్చి కుటుంబ విలువలు పునరుద్ధరించినది. అనేక గృహాల్లో కుటుంబ ప్రార్థనలు జరుపుకునే అవకాశం కల్పించినది. ఏ ప్రభుత్వం వలన కాని మద్యపాన నిషేధాన్ని

నిశితంగా అమలుపరచినది. జల, వాయు, ధ్వని కాలుష్యాన్ని అంతరింపజేసినది.

కరోనా వలన వేలకొలది ప్రజలు మరణించినా, ప్రతిరోజు రోడ్ల మీద యాక్సిడెంటు వలన సంభవించే లక్షలాది మరణాలను నియంత్రించినది. నిత్యం నెత్తురోడే రోడ్లను, నెత్తురు చిందించే హత్యలను నిరోధించింది. అన్ని రోడ్లు ఇంచు నిర్మానుష్యముగా తయారుచేసింది. బయట తిండికి అలవాటు పడిన వానికి ఇంటివంటరుచిని చూపించింది. ప్రతిమనిషికి అవుసరమైన పరిశుభ్రతను నేర్పించింది. దొంగతనం, మానభంగం, చైన్‌స్నాచింగ్ లాంటి నుండి ఉపశమనం లభించింది. గుంపుభక్తికి అలవాటు పడిన మానవునికి వ్యక్తిగత భక్తి, కుటుంబప్రార్థనల విలువలు నేర్పించింది. ఆరోగ్యమే మహాభాగ్యం అని మరీ మరీ నేర్పించింది. కంటికి కనబడని అతిసూక్ష్మమైన వైరస్ అంటే భయపడేలా చేసింది. మరియు కంటికి కనబడని నిజదేవుని తెలిసికోవాలని హెచ్చరించింది.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd. No. AP/KD-02/2018-2020**

**సత్యవాక్కు,**
**పోస్టు బాక్స్ - 80**
**కాకినాడ - 533 001**
**ఆంధ్రప్రదేశ్.**

**ప్రచురణ తేదీ ప్రతీ నెల 9వ తేదీ**
**పోస్టు చేయు తేది ప్రతీ నెలా 15వ తేదీ**

[redacted]

[redacted]

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004